# రసౌషధం!!

చలపతిరావుకు శలవులొస్తున్నాయంటే సరదా!

శలవులకు వాళ్ళ అమ్మ నాన్న బంధువులింటికి పంపిస్తారు ఓ నెల వాళ్ళ తన్ను!

కనీసం ఓ వారంరోజులైనా తాడికొండలో మకాం వేస్తాడు.

తాడికొండ అంటే రంగనాథస్వామి అనే చలపతిరావు ఉద్దేశం!

చలపతిరావు హైస్కూలులో ఉన్నప్పటినుండి శలవులకు తాడికొండ వెళ్తూనేవున్నాడు.

రంగనాథస్వామి కథలు చెపుతూనేవున్నాడు.

చలపతిరావు వయస్సు మారేకొద్దీ రంగనాథస్వామి ఇతివృత్తాలు మార్చేవాడు! రసాలు మార్చేవాడు. కథచెప్పే టెక్నిక్ కూడా మార్చేవాడు.

రంగనాథస్వామి గొప్ప కథకుడని చలపతిరావుకున్న అభిప్రాయం ఏడాదికి ఏడాదికీ బలపడిపోయింది.

ఈసారికూడా సెలవులివ్వగానే ముందు తాడికొండ వచ్చాడు చలపతిరావు!!

బస్సు దిగుతూనే చలపతిరావు ముందు రంగనాథస్వామి ఇంటికి వెళ్ళి ప్రెజెంటు వేసుకున్నాడు.

'సాయంత్రం వస్తాను. చెరువుదగ్గరికి' అని చెప్పి తర్వాత బంధువులింటికి వెళ్ళాడు.

'సాయంత్రం వస్తాను' అంటే ఓ మంచి కథచెప్పాలి. తయారుచేసుకో, అని సంకేతం!!

అయితే రంగనాథస్వామి ఏ కథా సాయంత్రం చెప్పడానికి సిద్ధం చేసుకోలేదు.

సాయంత్రం కాగానే చలపతిరావు చెరువుదగ్గరికి వచ్చాడు.

రంగనాథస్వామి అప్పటికే మర్రిచెట్టుకింద కూర్చొని వున్నాడు

చలపతిరావును చూచి చిరునవ్వు నవ్వి మర్రిచెట్టు మొదటినుంచి లేచి సిమెంటు బల్లమీదికి చేరాడు రంగనాథస్వామి

కాసేపు ఇద్దరూ యోగక్షేమాలు ముచ్చటించుకున్నారు.

చలపతిరావు తాడికొండలో తెలిసినవాళ్ళగూర్చి ఈ సంవత్సరంలో వచ్చిన పరిణామాలు తెలుసుకున్నాడు.

'అన్నట్లు లాస్టియర్ వచ్చినప్పుడు సుభద్రకు పెళ్ళిచూపులను కుంటున్నారు .. ఏమయింది?'

'పెళ్ళయింది - కడుపుతోవుంది.' అని చెప్పాడు రంగనాథస్వామి.

'ఇదేమిటి సీతారామమ్మ మరీ ఇంత చిక్కిపోయింది?'

చెరువునుండి నీళ్ళబిందె తీసుకొనిపోతున్న ఆమెనుచూచి వ్యాఖ్యానించాడు చలపతిరావు.

'ఏమిటో కుటుంబ కష్టాలు - మొగుడు సరిగ్గా చూడడంలేదు.'

ఇంతలో తుళ్ళూరునుండి బస్సువచ్చి నిలబడింది గుంటూరుకు.

'ప్రమీల సాయంత్రం గుంటూరు పోతున్నదెందుకో' చలపతిరావు సాభిప్రాయంగా ప్రశ్నించాడు బస్సెక్కుతున్న ఒక స్త్రీనిచూచి.

'వాళ్ళనాన్న గుంటూరు బ్రాడీపేటలో కాపురంపెట్టి అక్కడినుంచే బిజినెస్ చూసుకుంటున్నాడు-' అన్నాడు రంగనాథస్వామి చలపతిరావు బస్సెక్కుతున్న ప్రమీలను అలాగే చూస్తున్నాడు. దానితో రంగనాథస్వామి తన కథకు కావలసిన ఇతివృత్తం, రసం, టెక్నిక్ సిద్ధంచేసుకోవడం మొదలుపెట్టాడు.

'బస్తీలని అనుకుంటాం కాని పల్లెటూళ్ళల్లోనే చాలా అందమైనవాళ్లున్నారయ్యా!' చలపతిరావు వ్యాఖ్యానం.

'అందానికి దేశకాలాలతో సంబంధం లేదుబాబూ' రంగనాథస్వామి టీకాటిప్పణి.

'ఇంతకూ మీ క్లాసులో అందమైన పిల్లలెవరైనా వున్నారా?'

రంగనాథస్వామి సూటిగా ప్రశ్నించాడు.

'లేకేం - వాసంతి.' టక్కున నాలుక కరుచుకున్నాడు చలపతి.

పక్కున నవ్వాడు రంగనాథస్వామి.

'నేను చిన్నప్పుడు మద్రాసులో చదువుకునే రోజుల్లోకూడా అందమైన పిల్లలుండేవాళ్ళు. అందులో నప్పిన్నై ఒక పిల్ల ఉండేది. ఆమె మోజులోపడ్డాడు మా క్లాసుమేట్ సెల్వరాజ్!'

చలపతిరావులో ఉత్సాహం పెల్లుబికింది. చెవులు చేటలు చేసుకొని కూర్చున్నాడు.

రంగనాథస్వామి సిగరెట్ వెలిగించి ఓ దమ్ములాగి కథా కథనంలో పడ్డాడు.

'నప్పిన్నె వాళ్ళనాన్న సింగారవేలు-తల్లి ఆండాళ్

ఆండాళ్‌కు పూజాపునస్కారాలూ పార్థసారథి కోవెలకు వెళ్ళడాలూ వుండేవి. కాని సింగారవేలుకు ఇవేవీ ఉండేవికావు. ఆయనకు వయస్సు పెరిగిన కొద్దీ యవ్వనం వస్తుండేది. రికార్డుప్లేయర్ మీద ఇంగ్లీషు మ్యూజిక్ పెట్టి ఓబుడ్డి కొట్టి ఆండాళ్ రెండుబుజాలూ పట్టుకొని గదిలో పిచ్చిళ్ళబస్తాలా పిటపిటా గెంతుతూ వుండేవాడు కాకపోతే పేకాడుకోవడానికి క్లబ్బుకు పోయేవాడు:

మొగుడి ప్రవర్తన ఆండాళ్‌కు బొత్తిగా నచ్చేదికాదు 'ఏ వయస్సుకు ఆ బుద్ధులుండాలి." మణ్ణాళ పెణ్ణాళ, పొణ్ణాళ" తీరవలసిన రోజుల్లో ఈ బాల్‌రూండాన్సు లేమిటీఅని సింగారవేలును అసహ్యించుకునేది. క్రమంగా ఆమె కదిదిగులుగా పెట్టుకుంది. రోజూ పార్థసారధి కోవెలకో కపాలేశ్వరస్వామి కోవెలకో పోయి మొగుడిబుద్ధి మార్చమని మొక్కుకొని వచ్చేది!

నప్పిన్నె అందగత్తెల జాబితాలలోనే వస్తుంది. చామనఛాయరంగు. అయితే ముక్కూ కన్నూ తీరు చాలా అద్భుతంగా వుండేవి. ఒకసారి ఎవరైనా చూస్తే చాలు మరచిపోలేని రూపమది!! నప్పిన్నె కాలేజీకి రాకపోతే ఆరోజు కాలేజీలో పిల్లలు నీళ్లుకారిపోయేవారు!!

అలాంటి నప్పిన్నె మోజులో పడ్డాడు సెల్వరాజ్" అని రంగనాథస్వామి కొంచెం ఆగాడు

చలపతి ఊపిరి బిగబట్టుకొని కూర్చున్నాడు.

స్వామి ఆపడంతో కథకు ఇంకా బిగువు వచ్చింది.

'ఊఁ. తర్వాత ఏమయింది?' చలపతి ఉత్సుకత భరించలేక ప్రశ్నించాడు.

స్వామి సిగరెట్ పారేసి చెరువులో ముఖంకడుక్కొని కాసిని నీళ్లుతాగి మళ్ళీ సిమెంటు బల్లమీద కూర్చొని కథ మొదలుపెట్టాడు.

'నప్పిన్నె అంతతేలికగా సెల్వరాజుకు లొంగలేదు. సెల్వరాజు చెంగల్పట్టు దగ్గర ఒక పల్లెటూరుకు చెందినవాడు ధనవంతుడేమీకాదు. 'నీవు చదువుకుంటున్నావు. చక్కదనం వుంది. బాగానేవుంది. కాని స్టేటస్ మాటేమిటి?

మా నాయనకు నెలకు రెండువేలజీతం.' అన్నది ఒకరోజు మెరినాలో కూర్చొబెట్టి నప్పిన్నై సెల్వరాజ్‌తో.

'చదువుముగిశాక మనం అంతో ఇంతో సంపాదించుకోలేకపోము. కాని ప్రేమను రూపాయిలు అణాలూ పైసల్తోకొలుస్తామా?' అన్నాడు సెల్వరాజ్.

'కొలుస్తాము. ప్రేమంటే అదేమీ గాలిలో వుండే ఘనపదార్థంకాదు. నీ హృదయం నుండి నా హృదయానికి ప్రవహించే ఒక మత్తు దానిలో ఒక గమ్మత్తు!! దానివల్ల ఒక బంధం' ఫలితంగా సంసారం. పిల్లా జల్లా గుడ్డలూ చదువులూ ఇదంతా ఒక పెద్దవల అందులో మనిద్దరం పెద్దచేపలం-ఆలోచించుకో' అన్నది నప్పిన్నై-సెల్వరాజ్ ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఆలోచిస్తూనే నప్పిన్నై వెనుక తిరుగుతున్నాడు.

నప్పిన్నై, సెల్వరాజ్ మెరినాలో తేనాంపేటలో అడయార్‌లో పూనమల్లి హైరోడ్‌లో కలుస్తూనే వున్నారు

సాయంత్రాలు నగరాన్ని సర్వేచేస్తూనే వున్నారు. చేస్తూ చేస్తూ ఆలోచిస్తూ వున్నారు.

ఇలావుండగా పరీక్షలు ఇంకొక నెలరోజుల్లో వున్నాయనగా ఒకరోజు సాయంత్రం నప్పిన్నై అన్నది సెల్వరాజుతో.

'రాజా-నాకు నెల తప్పింది' అని-

సెల్వరాజు నెత్తిన అటంబాంబు పడ్డట్టనిపించింది. ఇప్పటిదాకా గాలిలో ఆలోచించాడు సెల్వరాజు ఇప్పుడు నేలమీద ఆలోచించడం మొదలుపెట్టాడు. ప్రేమించడం, చెట్టాపట్టాలు వేసుకోని తిరగడంవరకూ బాగానేవుంది హాయిగా, కాని ఇప్పుడప్పుడే తనొక తండ్రిని కాబోతున్నానని అన్పించుకునేందుకు సెల్వరాజు సిద్ధంగా లేడు.

నప్పిన్నై కూడా సిద్ధంగా లేదుకాని ఆయనకు లేనిభయమొకటి ఆమెకు పట్టుకోవడంతో గజగజ వణికిపోయింది.

'పద మానాన్నదగ్గరికి' అన్నది నప్పిన్నై సెల్వరాజును. సెల్వరాజు దోషిలా వాళ్ళనాన్నముందు బోనులో నిలబడేందుకు సిద్ధంగాలేడు.

'తొందరపడకు నప్పిన్నై! సమస్యను బ్రెంసాల్వ్ చేస్తుందిలే' అన్నాడు సెల్వరాజు.

'నీ పిండాకూడు చేస్తుంది. అటు పరీక్షా ఫలితాలకు ముందే ఇటు ప్రేమ ఫలితాలు బోర్డుకెక్కుతాయి నోరుమూసుకొని మా నాయనదగ్గరకు రా' అన్నది

నప్పిన్నై సెల్వరాజు మన్మధావతారం చాలించి పిల్లిలాగా మెరినాలో పల్టీలు కొట్టాడు.

పిచ్చెక్కినట్టు పాండిబజారు రోడ్డుపట్టుకొని తిరిగినాడు.

టెక్స్టుబుక్ హామ్లెట్ వదిలిపెట్టి

'టుమారో-ఆర్ నాట్ టుమారో'

అనే డైలాగు చెపుతూ తురాయిచెట్లకు ప్రదక్షిణం చేశాడు!!

'అంత చేవలేని దద్దమ్మవు. చేతకానిచవటవు ప్రేమించడం దేనికి-మరో పిల్లగొంతుకోయడం దేనికి-' అని ఏడ్చింది నప్పిన్నై!

సెల్వరాజుకు కోపంవచ్చింది 'ప్రేమ ప్రేమ-పెళ్ళి పెళ్ళే!' పొమ్మన్నాడు

'రాస్కెల్! ఈమాట నా వెంబడితిరిగినప్పుడు నేను నీతో అన్నట్లయితే నీవు ఆత్మహత్య చేసుకునేవాడివి' అన్నది నప్పిన్నై!

"నీకు నేనొక్కడినే స్నేహితుణ్నికాదు. ముత్తు, బాలన్, వేలాయుధం ఇత్యాదులు చాలామంది వున్నారు. ఎవడో చేసినపాపానికి నేను పతినై పితనై అనుభవించలేను-అన్నాడు సెల్వరాజు-"

రంగనాథస్వామి ఆగాడు.

"అప్పుడేమయింది??" చలపతి గజగజ వణికిపోతూ ప్రశ్నించాడు.

స్వామి చలపతి కళ్ళల్లోకి సూటిగాచూస్తూ చలపతి అప్పుడు చూడాలి నప్పిన్నై రూపం! బీచ్‌లో భద్రకాళిలా నిలబడింది. నిలబడి కాలి స్లిప్పర్ తీసి సెల్వరాజుకు కొట్టింది-'

'ఆఁ-కొట్టిందా?'

'ఆఁ-కొట్టింది-ఎడాపెడా కొట్టింది-

దవడలు వాచేటట్లు కొట్టింది - పళ్ళూడి చేతిలోకి వచ్చేటట్లు కొట్టింది చలపతీ '....' అని స్వామి మళ్ళీ ఆగాడు.

చలపతికెందుకో చెమటపోస్తున్నది.

'ఆఁ- తర్వాత' అన్నాడు బలహీనంగా-

రంగనాథస్వామి మళ్ళీ మొదలుపెట్టాడు.

'ఈ కథంతా ఆండాళ్‌కు తెలిసింది. ఆమె లబోదిబోమంది. చెట్టంత కూతురును పెట్టుకొని తైతక్కలాడే మొగుడివల్లనే ఈ ముప్పు వచ్చిందని ఆమె విలవిలలాడిపోయింది. 'ఏవయస్సుకు ఆబుద్ధులుండాలి. చావు తర్వాత

లావు దుఃఖమన్నట్లు ఇప్పుడీ శృంగారంతో కొంపముంచావు నువ్వు. పుచ్చిన దూలం చిగురించదు. కాటికి పోయే కట్టె చిగురించదు' అని మొగుడికొక తమిళ సామెత చెప్పి ఏడ్చింది ఆండాళ్.

సింగారవేలు భార్యతో బాత్‌రూం డాన్సుమాని ఆ సాయంత్రం సెల్వ రాజుకోసం వెతకడానికి బయలుదేరాడు.

అయితే అప్పటికే సిల్వరాజ్ పరీక్షలివ్వడం కూడా మానేసి మద్రాసు సెంట్రల్‌లో ఏరైలో ఎక్కాడు.

సింగారవేలు బాగా ఆలోచించాడు. పాదరసంలాంటి అతడి బుర్ర రాత్రికి రాత్రే నిర్ణయాలు తీసుకున్నది. కూతురుకు ఎబార్షన్ చేయించి త్రివేండ్రం సంబంధం ఖాయపరిచాడు ఒక కారుకూడా కట్నంకింద ఇస్తానని చెప్పి-

"ఆ తర్వాత-" చలపతి నివ్వెరపోయి ప్రశ్నించాడు.

'తర్వాత ఏముందీ? సమ్మర్‌లో హాయిగా నప్పినెన్న మురుగన్‌లకు వైభవోపేతంగా కల్యాణం జరిగింది. అటునుండి ఆచే దంపతులు ఊటీకి హనీ మూన్‌కు వెళ్ళారు-

"అమ్మాయి ఆగడంవల్లనైనా మీరు బాధ్యత పట్టించుకున్నారు- ఆ సెల్వ రాజ్ ఎవడో దేవుడిలాంటివాడు. నా కూతురుకు లక్షాధికారి సంబంధం వచ్చే టట్లు చేసిపోయాడు" అని ఆండాళ్ మైలాపూరు కపాలేశ్వరుడి కోవెలలో పాతిక కొబ్బరికాయలు కొట్టింది!! ...

రంగనాథస్వామి కథ చెప్పడం ఆపాడు-

తాడికొండ పంచాయితీసమితి రేడియో, విజయవాడ స్టేషనుషనునుండి గ్రామస్థుల గోష్ఠి వినిపిస్తున్నాది.

చుట్టూ బాగా చీకటి!!

"అయితే సెల్వరాజ్ ఏమైనాడు?" చలపతిరావు ప్రశ్నించాడు మళ్ళీ- ఇంకా కథ ముగియలేదుకదా- అన్నట్లు!!

"ఏమో తెలియదు- ఇటు పిల్లాపోయింది- అటు పరీక్షాపోయింది- ఇంకేం చేస్తాడు. ఏ గుడ్డలకొట్లోనో గుమాస్తాగా చేరివుంటాడు...."

"ఒకవేళ సెల్వరాజ్ ఆరోజు మెరినాలో పెళ్ళికి ఒప్పుకొనివుంటే ఏమ య్యేది?" సాలోచనగా ప్రశ్నించాడు చలపతి మళ్ళీ.

"ఏమయ్యేదీ - నప్పినెై ఒక కారూ, మేడా, ఫ్రిజ్, రికార్డుప్లేయర్ కొన మనేది - సమ్మర్లో ఊటీ తీసుకొని పొమ్మనేది. బాలన్‌తో వేలాయుధంతో కలిసి మహాబలిపురం పిక్నిక్ పెట్టుమనేది. దానితో అప్పుడైనా చచ్చి వుండేవాడే.

"ఛ! ఏం ప్రేమ బాబాయ్ - ఇది మనలాంటివాళ్ళకు పడదు" అన్నాడు చలపతిరావు గుండె దడదడ కొట్టుకొంటుండగా.

"ఔనుమరి. అలా జరిగిందాకథ ...." అని ఊరుకున్నాడు రంగనాథ స్వామి.

"మళ్ళీ సెల్వరాజు. నప్పినెై జీవితంలో ఎప్పుడైనా కలిశారా?" చలపతి రావు ప్రశ్నించాడు.

"తెలియదు. కలిస్తే అక్కడినుంచి మళ్ళీ కథ మొదలవుతుంది. ఆ కథతో ఓ మంచి సినిమా తీసిపారెయ్యొచ్చు."

"ఇంతకూ నీకు ఎప్పుడైనా సెల్వరాజ్ కనిపించాడా?" చలపతి ప్రశ్నించాడు.

"అబ్బే నాకు జ్వరం వచ్చి ఆ సంవత్సరం పరీక్ష ఇవ్వకుండా డిస్ కంటిన్యూ చేసి ఇంటికి వచ్చాను తర్వాత మళ్ళీ నేనెప్పుడూ మద్రాసు పోలేదు- పరీక్షలకు".

"అంటే ఆ బాచ్‌లో మీరూ సెల్వరాజ్ ఇద్దరు మాత్రమే డిస్‌కంటిన్యూ చేశారా?"

"ఆఁ- ఆఁ- అంతే అనుకోవాలి మరి." అని రంగనాథస్వామి నవ్వాడు.

ఆ నవ్వు చీకట్లోకూడా తెల్లగా మెరిసింది.

చలపతికి ఏదో అనుమానం వచ్చింది "కొంపదీసి ఈ రంగనాథ స్వామే .. ??" అని అనుకున్నాడు అంతేకాని, పైకి ఇంకేం మాట్లాడలేదు.

"వాసంతి అనే పేరు శాశ్వతంగా మరచిపోవాలి. పరీక్షల్లో ఫస్టులో రావాలి" అనుకున్నాడు చలపతి మళ్ళీ.

"ఏమిటీ గొణుగుతున్నావు?" రంగనాథస్వామి ప్రశ్నించాడు చలపతిని.

"ఏంలేదు బాబాయ్ - నేను పరీక్షల్లో ఫస్టున రావాలనుకుంటున్నాను" అన్నాడు చలపతి.

"అయితే నా కథ మంచి రసవత్తరంగానే నడిచిందన్నమాట ఈ సాయంత్రం" అనుకున్నాడు రంగనాథస్వామి!!